RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 183 పేజీలు - 08 శనివారం 30 మే 2026


## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## మహనీయుల విగ్రహాల ఏర్పాటులో ఇబ్బందులు

- అధికారులతో సమీక్షించిన మంత్రి అడ్లూరి



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 29:** మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం మిగతా2లో...

## తెలంగాణలో అంచనాను మించి
# ధాన్యం ఉత్పత్తి

- అయిన ఆచివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 29:** దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా2లో...



## కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

- పార్థివ దేహం వద్ద పుష్పాంజలి

**తొలి అక్షరం/రాజన్నసిరిసిల్ల,మే 29:** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. గుండెపోటుతో కాసర్ల పద్మ మరణించారనే వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆయన సిరిసిల్లకు వచ్చారు. అనంతరం కాసర్ల పద్మ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి

మిగతా2లో...

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు


నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 29:** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని మిగతా2లో...

## శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

- 1గంటలోపు బుక్ చేసుకున్న వారికి 4గంటలకు దర్శనం



**తొలి అక్షరం/తిరుమల,మే 29:** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణజ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం కలగనుంది. ఈ టికెట్లు మిగతా2లో...

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

- కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 29:** రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం మిగతా2లో...

## రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

- జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి
- 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలి
- కార్మికులకు ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపు




## నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

వారిని కఠినంగా శిక్షించి తీరుతాం: విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 29:** నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నా రు. నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫల మైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు,

మిగతా2లో...

## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం

ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 29:** హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ీరాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని

మిగతా2లో...

## చర్లపల్లి జైలుకు బండి భగీరథ్ తరలింపు



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 29:**

పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. 3 రోజుల పోలీస్ కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజిగిరి కోర్టులో హాజరు పర్చారు. కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది.అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

**(మొదటి పేజీ తరువాయి)**

2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూ.లు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్దంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటి వరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నా మన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రా లు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవం తమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

# విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించేందుకే రైతు డిస్కం

**● భవిష్యత్‌లో మోటర్లకు మీటర్లు పెట్టి సబ్సిడీలు ఎత్తివేసే కుట్ర ● ఈఆర్‌సీ ఎదుట సీపీఐ(ఎం), సీపీఐ, బీఆర్ఎస్, ప్రజా సంఘాల అభ్యంతరాలు ● రైతులకు మెరుగైన విద్యుత్ కోసమే మూడో డిస్కం ● అనుమతించాలని కాంగ్రెస్ విజ్ఞప్తి ● పైలట్ ప్రాజెక్ట్ చేపట్టి...ఈ తర్వాతే ముందుకెళ్లాలి ● విద్యుత్ ఉద్యోగ సంఘాల వినతివాడి, వేడిగా సాగిన రైతు డిస్కం బహిరంగ విచారణ ● ఈఆర్‌సీ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ**

**తొలి అక్షరం/హైదరాబాద్,మే 29:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోయే రైతు డిస్కం అనుమతులపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లోని విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో బహిరంగ విచారణ నిర్వహించింది. మండలి చైర్మెన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్, సభ్యులు చెరుకూరి శ్రీనివాసరావు, కంచెర్ల రఘు బహిరంగ విచారణ నిర్వహించారు. రైతులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యుత్ ఉద్యోగ సంఘాలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. విచారణ ప్రారంభంలో తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఆర్‌పీడీసీఎల్) చైర్మెన్ ముషారఫ్ అలీ ఫారుఖీ డిస్కం ఏర్పాటు, నిర్వహణ, ఆర్థిక స్థితిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం




తెలంగాణలోని రెండు డిస్కంలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని పేర్కొన్నారు. 2025 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణ డిస్కంల సమీకృత నష్టాలు సుమారు రూ.69,741 కోట్లు కాగా, ప్రభుత్వ విభాగాల నుంచి రూ.54,090 కోట్లు రావాల్సి ఉన్నాయని వివరించారు. ఈ ఏడాది విద్యుత్ వినియోగ నష్టాలు 19.8 శాతంగా నమోదయ్యాయన్నారు. రైతులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను కొంత మంది పక్కదారి పట్టిస్తున్నారని చెప్పారు. వీటన్నింటికి చెక్ పెట్టడంతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామనీ, దీనికి సంబంధించిన అనుమతులను మంజూరు చేయాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. ఒప్పందం ప్రకారం విద్యుత్ లైన్లు, డీటీఆర్‌లు, వ్యవసాయ పంపుసెట్ల బదిలీకి ఎలాంటి అభ్యంతరం లేదని ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు జితేష్ వి.పాటిల్, వరుణ్‌రెడ్డి తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ మాజీ మంత్రులు ఎస్.నిరంజన్‌రెడ్డి, ఎం.జగదీశ్‌రెడ్డి తమ వాదనలు వినిపించారు. సబ్సిడీలను ఎత్తివేసేందుకే సర్కార్ రైతు డిస్కం ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు.ప్రస్తుత సమీకృత వ్యవస్థలో లేని అదనపు ప్రయోజనం ఈ కొత్త సంస్థ ద్వారా ఏమొస్తుందో అటు రైతులకు, ఇటు విద్యుత్ వినియోగదారులకు అర్థం కావడం లేదని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కేవలం వ్యవసాయ వినియోగదారుల కోసం ప్రత్యేక డిస్కంను ఏర్పాటు చేయలేదన్నారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్న తెలంగాణ విద్యుత్ రంగాన్ని ప్రమాదకరమైన పునర్వ్యవస్థీకరణ ప్రయోగానికి గురిచేస్తున్నారనీ, రైతు డిస్కం ప్రతిపాదన వెనుక అనుమానాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు డిస్కం నిజం అయితే మిషన్ భగీరథ, లిఫ్ట్ ఇరిగేషన్, హెచ్ఎండబ్ల్యూఎస్-ఎస్‌బీ, మున్సిపల్ నీటి సరఫరా వ్యవస్థలను కూడా ఒకే సంస్థ పరిధిలోకి ఎందుకు తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. ఈఆర్సీసీ రైతు డిస్కంకు అనుమతించొద్దని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్ష?్నలు అరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ తెలంగాణలో డిస్కంల నష్టాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలే కారణమన్నారు. రూ.5 కోట్ల మూల ధన పెట్టుబడి, రూ.29 వేల కోట్ల మైనస్‌లో ఉన్న సంస్థ రైతులకు ఎలా సేవలందిస్తుందని ప్రశ్నించారు.

# శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సదుపాయం 2025 మే 1 నుంచి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుందని తితిదే తెలిపింది.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

**(మొదటి పేజీ తరువాయి)**

తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్ఎ ంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్ఈకి సహకరిస్తోందని తెలిపారు.11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవా బు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. ప్రక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

# కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

**(మొదటి పేజీ తరువాయి)**

తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాసర్ల పద్మకు ఘనంగా నివాళులర్పించారు. కాసర్ల పద్మ 2020లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 27వ కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పది రోజుల కిందట కాసర్ల పద్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.
అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు. పద్మ మృతి పట్ల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పాలకవర్గం, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# మహనీయుల విగ్రహాల ఏర్పాటులో ఇబ్బందులు

**(మొదటి పేజీ తరువాయి)**

జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటులో అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నియమాలకు విరుద్ధమైన స్థలాలపై ముందుగానే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు చెప్పొద్దని అధికారులకు మంత్రి సూచించారు. దళిత సంఘాల నాయకులపై అనవసరంగా కేసులు పెట్టొద్దని తెలిపారు. అలాగే ప్రజల భావోద్వేగాలను గౌరవించాల్సి ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్, ఫులే, జగ్జీవన్ రామ్ ఆశయాలే ప్రభుత్వానికి మార్గదర్శకమని చెప్పారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అభివర్ణించారు. విగ్రహాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాల్సి ఉందని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

# ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

**(మొదటి పేజీ తరువాయి)**

చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

# రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 29:** రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

# తొర్రూర్ ఆర్యభట్ట స్కూల్‌లో సిబిఎస్ఈ సిలబస్‌లో అడ్మిషన్లు ప్రారంభం

**• స్కూల్ కరస్పాండెంట్ నేలకుర్తి మధుకర్ రెడ్డి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే 29:** తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఆర్యభట్ట స్కూల్ లో మొట్టమొదటిసారిగా సీబీఎస్ఈ సిలబస్ లో అడ్మిషన్లను స్వీకరిస్తున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ నేలకుర్తి మధుకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. క్రమశిక్షణ పట్టుదలతో కూడిన విద్యను అందిస్తున్న ,అతిపెద్ద స్కూలుగా గుర్తింపు పొందిన ఆర్యభట్ట స్కూలుకు సెంట్రల్ సిలబస్ (సీబీఎస్ఈ) అనుమతి లభించిందనీ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే (సిబిఎస్ ఈ) సెంట్రల్ సిలబస్ తో కూడిన విద్యను అందిస్తున్నామని, ఎల్ కే జీ నుంచి పదో వ తరగతి వరకు అడ్మిషన్లను తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతేకాకుండా హాస్టల్ అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ప్రత్యేక మేనేజ్మెంట్ ఉంటుందని , పాఠశాలకు, హాస్టల్ కు ఎలాంటి సంబంధం ఉండదని ,కావున హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ మేనేజ్మెంట్ వారిని సంప్రదించి అడ్మిషన్లు పొందాలని కోరారు.

# ఇంధన ధరలు తగ్గించకపోతే సీఎం నివాసాన్ని ముట్టడిస్తాం: వేముల మారయ్య



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే 29:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, సిఎన్జీ ధరలకు నిరసనగా బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మల్లాపూర్ చౌరస్తాలో రిక్షా తొక్కుతూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంధన ధరల పెంపుతో సామాన్య ప్రజలు, కార్మికులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు.ప్రత్యేకించి ఆటో, క్యాబ్, రిక్షా కార్మికుల బతుకులు మరింత భారంగా మారాయని, పెరుగుతున్న ఇంధన ధరల కారణంగా వారి ఆదాయం తగ్గిపోయి కుటుంబాల పోషణ కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉద్ధృతం చేసి సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ప్రజలపై భారాలు మోపుతున్న ఇంధన ధరల పెంపు నిర్ణయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని వేముల మారయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు రామాంజనేయులు, పాలపల్లి రమేష్, గోపాల్ నాయక్, శ్రీనివాసు, రమేష్ ,హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా గౌరీశంకర్

**• నియామక పత్రం అందజేసిన అధ్యక్షులు లక్ష్మి నారాయణ**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే 29:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణానికి చెందిన ప్రొద్దుటూరీ గౌరీ శంకర్ ను రాష్ట్ర అధ్యక్షులు,అమరవాది. లక్ష్మీనారాయణ,హైదరాబాద్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేసినారు. అమరవాది లక్ష్మీనారాయణ కు చేదోడు వాదోడుగా అతను చేసే కార్యక్రమాలలో ముందుండి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుని ఆర్యవైశ్య సంఘంలో వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలలో ముందుండి పాల్గొనే వ్యక్తి ప్రొద్దుటూరి.గౌరీ శంకర్.గతంలోరాష్ట్రఉపాధ్యక్షులుగా ఈసారి రెండవసారిగా నియామక పత్రం అందుకోవడం ఆర్యవైశ్య ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. ఆర్యవైశ్యులకు ఏ సహాయ సహకారాలు అందించుటలో ముందుండే గౌరీ శంకర్ ఎన్నో ఉన్నత శిఖరాలకు అందుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్యవైశ్య సోదరులు ఆశిస్తున్నారు.

# పాలకుర్తిలో ఘనంగా మెగా జాబ్‌మేళా

**• నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం • హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**• భారీగా తరలివచ్చిన ఉద్యోగార్థులు..**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే 29:** పాలకుర్తి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా అత్యంత ఘనంగా ప్రారంభమైంది.శుక్రవారం స్థానిక శ్రీ సోమేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు తమ ప్రతిభను నిరూపించుకుని, సొంత కాళ్లపై నిలబడేందుకు ఈ జాబ్ మేళా ఒక అద్భుతమైన వేదిక అని కొనియాడారు.చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల





కోసం ఎదురుచూస్తున్న యువతకు ప్రైవేట్ రంగంలో ఉన్నత అవకాశాలను చేరవ చేయడానికే ఈ ఉచిత జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడం ద్వారానే సమాజం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగ సమస్య నిర్మూలనకు తమ ట్రస్ట్ భవిష్యత్తులో కూడా మరిన్ని ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆమె స్పష్టం చేశారు.ఈ మెగా జాబ్ మేళాకు పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలనుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే కళ్యాణ మండపానికి చేరుకున్న అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ప్రత్యేక కౌంటర్లలో అభ్యర్థుల విద్యార్హతలను పరిశీలించి, ఇంటర్వ్యూలు నిర్వహించారు.జాబ్ మేళాకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రస్ట్ వాలంటీర్లు ప్రత్యేక కౌంటర్ల ద్వారా తగిన సహాయ సహకారాలు అందించారు. ఇంటర్వ్యూలతో పాటు యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కెరీర్ గైడెన్స్ మరియు ఉద్యోగ అవకాశాలపై నిపుణులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన విభాగం నాయకులు, హనుమండ్ల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, వాలంటీర్లు మరియు వందలాది మంది ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**షాద్‌నగర్‌లో 37 మహిళా సంఘాలకు రూ.4 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ**

**తొలి అక్షరం/షాద్ నగర్,మే 29:** 99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బస్వం, మున్సిపల్ కమిషనర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా 37 మహిళా సంఘాలకు రూ.4 కోట్ల వడ్డీ లేని రుణాలను మంజూరు చేసి చెక్కులను పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా ఎదిగి కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు.









ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా మరింత బలపడాలని కోరారు.అలాగే ఆర్పీలకు పలు సూచనలు చేస్తూ గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవాభావంతో పనిచేయాలని అన్నారు. "సృష్టికి మూలం అమ్మఢ అధికారం శాశ్వతం కాదుఢ సేవే గొప్పదంటూ మహిళల పాత్రను కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ సునీత పనితీరును ఎమ్మెల్యే అభినందిస్తూ ప్రజల సమస్యలపై వెంటనే స్పందించే మంచి అధికారిణిగా ప్రశంసించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్ సమన్వయంతో పట్టణ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, కౌన్సిలర్ మురళీ మోహన్, దిలీప్, బచ్చలి నరేష్,కో ఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, నేతలు కృష్ణ రెడ్డి, నల్లమోని శ్రీధర్, మహమ్మద్ ఇబ్రహీం, బాలరాజు గౌడ్,ముబారక్ అలీఖాన్, సాదిక్, సోలిపూర్ అనిల్, చందూలాల్, కరుణాకర్, రాయికల్ శ్రీనివాస్, చందు నాయక్, రవితేజ, తుపాకుల శేఖర్, రమేష్, మెప్మా సిబ్బంది పట్టణ సమైక్య అధ్యక్షురాలు జయమ్మ, గోసియా,అనితా , శైలజ, విజయ, భాను, సునీత, స్వప్న, నీరజ, సంగీత ,గౌరమ్మ, అనిత, బాలమణి జ్యోతి ,తదితరులు పాల్గొన్నారు.

# పెద్దనాగారం స్టేజికి 'భద్రతా కవచం'..!

**నేరాల నియంత్రణే లక్ష్యంగా 'కంటికి రెప్పలా' నిఘా నేత్రాలు!**

**రూ.25 వేలతో సీసీ కెమెరాల ఏర్పాటు.. ప్రారంభించిన ఎస్సై వెంకన్న, సర్పంచ్ సోనియా!**

**అనుమానాస్పద కదలికలకు చెక్.. శాంతిభద్రతలకు పెద్దపీట!**

**భవిష్యత్తులో మరిన్ని కూడళ్లలో కెమెరాల ఏర్పాటుకు గ్రామపంచాయతీ సంకల్పం!**

**తొలి అక్షరం/నరసింహుల పేట మే 29:** ఆ పల్లె ఇకపై నిశ్చింతగా నిద్రపోనుంది.. ఆ కూడలి గుండా ప్రయాణించే వారు భద్రతా భావంతో ముందుకు సాగనున్నారు. గ్రామస్తుల రక్షణే ధ్యేయంగా, నేరస్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా నరసింహులపేట మండలం పెద్దనాగారం స్టేజి గ్రామం ఓ అద్భుతమైన ముందడుగు వేసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, గ్రామ శాంతిభద్రతలకు సరికొత్త 'భద్రతా కవచాన్ని' తొడిగింది. పెరుగుతున్న నేరాల నియంత్రణే లక్ష్యంగా పెద్దనాగారం స్టేజి గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు (నిఘా నేత్రాలు) శుక్రవారం నుంచి అధికారికంగా అందుబాటులోకి వచ్చాయి.గ్రామ సర్పంచ్ భూక్య సోనియా హరిలాల్, స్థానిక ఎస్సై భానోత్ వెంకన్నలు సంయుక్తంగా ఈ నిఘా వ్యవస్థను ప్రారంభించారు. గ్రామ రక్షణ కోసం తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.**నేరగాళ్ల గుండెల్లో వణుకు.. నిఘా నీడలో ప్రతి కదలిక!** ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న దొంగతనాలు, రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం పల్లె ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనికి తోడు రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, అర్ధరాత్రి వేళల్లో జరిగే అవాంఛనీయ ఘటనల కట్టడికి సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత ఆవశ్యకంగా మారింది. దీనిని గుర్తించిన పెద్దనాగారం గ్రామపంచాయతీ సుమారు రూ.25 వేల వ్యయంతో అత్యంత ఆధునిక సాంకేతికత కలిగిన రెండు సీసీ కెమెరాలను ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసింది.ఈ సందర్భంగా ఎస్సై భానోత్ వెంకన్న మాట్లాడుతూ.. "సీసీ కెమెరాలు అనేవి కేవలం పరికరాలు కావు, అవి పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేసే 24 గంటల రక్షక భటులు. గ్రామంలో జరిగే ప్రతి కదలికపై నిఘా ఉండటం వల్ల నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయం నెలకొంటుంది. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు నేరస్థులను పట్టుకోవడానికి, త్వరితగతిన ఆధారాలు సేకరించేందుకు ఈ కెమెరాలు పోలీసు వ్యవస్థకు ఎంతో సహాయపడతాయి. ప్రతి గ్రామంలోనూ ప్రజాప్రతినిధులు, యువత, దాతలు ముందుకు వచ్చి భద్రతా చర్యల్లో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.**ప్రజల రక్షణే మా ప్రథమ కర్తవ్యం: సర్పంచ్ సోనియా**





గ్రామ ప్రజల ఆస్తులు, ప్రాణాల రక్షణ కోసం ఎంతటి నిర్ణయానికైనా వెనుకాడబోమని లిసర్పంచ్ భూక్య సోనియా హరిలాల్‌లి స్పష్టం చేశారు. ఆమె మాట్లాడుతూ.. "మా గ్రామ ప్రజల భద్రతే లక్ష్యంగా గ్రామపంచాయతీ పాలకమండలి ఈ నిర్ణయం తీసుకుంది. సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వాడుకోవడం మన బాధ్యత. ఇప్పుడు ఏర్పాటు చేసిన కెమెరాలు ప్రాథమిక దశ మాత్రమే. భవిష్యత్తులో గ్రామంలోని మరిన్ని ప్రధాన కూడళ్లు, సందుల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గ్రామాన్ని నేరరహిత పల్లెగా మార్చడమే మా సంకల్పం" అని ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు సహకారాన్ని అందించిన పాలకమండలి సభ్యులకు, గ్రామ పెద్దలకు, దాతలకు ఎస్సై వెంకన్న, సర్పంచ్ సోనియా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.**ఘనంగా ప్రారంభోత్సవం.. తరలివచ్చిన గ్రామ ప్రముఖులు** పెద్దనాగారం స్టేజి వద్ద అత్యంత కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ భద్రతా ముందడుగును అందరూ ముక్తకంఠంతో అభినందించారు. ఉప సర్పంచ్ రవిబాబు, వార్డు సభ్యులు జగ్గు, పద్మ వెంకన్న, శాంతమ్మ, జయపాల్ రెడ్డి, ప్రముఖ నాయకులు సప్పిరెడ్డి కటరెడ్డి, బాణాల ప్రవీణ్, సోమయ్య, భూక్య చందు, మార్క వెంకన్న, గుగులోతు నరేష్, చలమల్ల శ్రీను, గ్రామపంచాయతీ (జీపీ) సిబ్బంది మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాటిగడ్డకు ప్రగతి వెలుగులు తీసుకొస్తా..

**• షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్".. • గ్రామంలో రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ, రూ. 10 లక్షలతో మహిళ సమాఖ్య భవనాలు ప్రారంభం.. • త్వరలోనే వంతెన పనులకు మోక్షం • యువ సర్పంచ్ అఖిల్ రెడ్డిను అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ • పాటిగడ్డకు ప్రగతి వెలుగులు తీసుకొస్తా..** **• షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్".. • గ్రామంలో రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ, రూ. 10 లక్షలతో మహిళ సమాఖ్య భవనాలు ప్రారంభం.. • త్వరలోనే వంతెన పనులకు మోక్షం • యువ సర్పంచ్ అఖిల్ రెడ్డిను అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్** **• అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు రూ. 5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు**







**తొలి అక్షరం/షాద్ నగర్, మే 29:** కేశంపేట మండల పరిధిలోని పాటి గడ్డకు ప్రగతి వెలుగులు తీసుకువచ్చేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నానని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పాటిగడ్డ గ్రామంలో రూ. 20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, రూ. 10 లక్షలతో మహిళా సమాఖ్య భవనాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. ఈ భవనాలను స్థానిక యువ సర్పంచ్ అఖిల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో ఎప్పటినుంచో ప్రజలు కోరుతున్న వంతెన పనులను కూడా త్వరలోనే పూర్తి అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో ముందుకు నడపాలని లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని వెల్లడించారు. తాను కూడా గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వెల్లడించారు. ఇందులో భాగంగానే పాటిగడ్డ గ్రామంలో మహిళా సమాఖ్య భవనం, గ్రామపంచాయతీ భవనాలు నిర్మించడం జరిగింది అన్నారు. వంతెన పనులు కూడా మొదలయ్యాయని త్వరలోనే పూర్తి చేసి సమస్య నివారిస్తామని స్పష్టం చేశారు. పాటిగడ్డ గ్రామానికి మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలబెడతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పాటిగడ్డ యువ సర్పంచ్ అఖిల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో పెద్ద ఎత్తున గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని భవిష్యత్తులో కూడా గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని గ్రామ ప్రజల సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు రూ. 5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్పంచ్ అఖిల్ రెడ్డి అందజేశారు. గ్రామ సర్పంచ్ అఖిల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల, కొత్తపేట జగదీష్, పల్లె ఆనంద్, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సహించం

**• మహానాడులో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన వైసీపీ యువనేత శీలం శీను**




**తొలి అక్షరం/షాద్ నగర్, మే 29:** ఆంధ్ర ప్రదేశ్ తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "తెలంగాణ ఏడిక్షనరీలో లేదు" అంటూ చేసిన వ్యాఖ్యలు యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయని వైసీపీ యువనేత శీలం శీను మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు, పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. వేలాది మంది యువత ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని తక్కువ చేసి మాట్లాడటం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అనేది కేవలం ఒక ప్రాంతం కాదనిడ అది కోట్లాది మంది ప్రజల భావోద్వేగం, ఆత్మగౌరవం, చరిత్ర అని అన్నారు. అలాంటి రాష్ట్రాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం బాధ్యతాయుతమైన నాయకులకు తగదని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ భావాలను అవమానించే ప్రయత్నాలు ఎవరూ చేయకూడదని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు తమ స్వాభిమానంపై దాడి జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని స్పష్టం చేశారు. ప్రజా నాయకులు మాట్లాడే ప్రతి మాటలో బాధ్యత ఉండాలని, ఒకరి మెప్పు కోసం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీయడం సరైంది కాదని అన్నారు. తెలంగాణ సాధన వెనుక ఉన్న చరిత్రను గుర్తు పెట్టుకుని నాయకులు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని శీలం శీను డిమాండ్ చేశారు.

# నీటి సమస్య తీర్చాలి.. తథాస్తు..

**• ఎగిరే గ్రామంలో తాగునీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**• కి.మీ. పైప్ లైన్ మంజూరు.. కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**





**తొలి అక్షరం/జిల్లేడు చౌదరిగుడ, మే 29:** సమస్య ఉందని, తీర్చాలని చెప్పగానే తథాస్తు అని మన మంచి.. వెను వెంటనే పైప్ లైన్ మంజూరు చేసి గ్రామస్తుల ప్రశంసలు అందుకున్నాడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. జిల్లేడు చౌదరిగుడా మండల పరిధిలోని ఎదిర గ్రామంలో తాగునీటి అవసరాల నిమిత్తం అడగగానే కిలోమీటర్ మేరకు పైప్ లైన్ మంజూరు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగిన వెంటనే అవసరాన్ని తీర్చి గ్రామస్తుల ఇబ్బందులు నివారించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జక్కని రవికుమార్, గ్రామ సర్పంచ్ దొడ్ల విజయలక్ష్మి, దామోదర్ రెడ్డి, డిప్యూటీ సర్పంచ్ గొడుగుని పల్లి భాస్కర్, జాంగిర్, సుధాకర్ గౌడ్, చక్కని భీమ్ రాజ్, పాపయ్య, వార్డు సభ్యుడు బుడమోల కృష్ణయ్య, రాపోలు రాములు, మొగులయ్య, బైండ్ల బాలరాజ్, మురుగని రాములు, చౌడాపూర్ మల్లయ్య, ఎండి చాంద్ పాషా, వడ్డే గోపాల్, నరేష్, సురేష్, కావాలి నర్సింలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆత్మీయ కలయిక.. అంతలోనే అనంతలోకాలకు...

**పది రోజుల క్రితమే స్నేహితులతో నవ్వులు పంచుకున్న మహేశ్వరి... ఇప్పుడు జ్ఞాపకాలలో మాత్రమే**

**గ్యాస్ లీక్ ప్రమాదంలో మృతి.. ఇద్దరు చిన్నారులకు తీరని లోటు**





**తొలి అక్షరం/నరసింహులపేట: మే 29:** ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకున్న బాల్య స్నేహితుల ఆనందం కేవలం పది రోజులకే విషాదంగా మారింది. చిన్ననాటి జ్ఞాపకాలను మళ్లీ గుర్తుచేసుకుంటూ నవ్వులు పూయించిన ఆ "గెట్ టుగెదర్" కార్యక్రమం ముగిసిన కొద్దిరోజుల్లోనే వారిలో ఒకరు శాశ్వతంగా దూరమవడం అందరినీ కలచివేసింది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన 2006-07 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఇటీవల ఘనంగా సమ్మేళనం నిర్వహించుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆప్యాయంగా మాట్లాడుకుంటూ చిన్ననాటి ముచ్చట్లలో మునిగిపోయారు. సెల్ఫీలు దిగుతూ, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఎంతో సంతోషంగా గడిపారు. ఆ కార్యక్రమంలో అందరితో ఎంతో ఆప్యాయంగా కలిసిమెలిసి కనిపించింది నర్సింహులపేట మండలం వంతడపల గ్రామానికి చెందిన గడ్డం మహేశ్వరి. "మళ్లీ త్వరలో కలుద్దాం" అంటూ స్నేహితులతో నవ్వుతూ మాట్లాడిన ఆమె... కొన్ని రోజులకే శాశ్వతంగా దూరమవుతుందని ఎవరూ ఊహించలేదు. కుటుంబంతో కలిసి ఖమ్మంలో నివసిస్తూ క్యాటరింగ్ పనులు చేస్తున్న మహేశ్వరి, విధి నిర్వహణలో భాగంగా వంట చేస్తుండగా అకస్మాత్తుగా గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా మారింది. కొన్ని రోజుల పాటు మృత్యువుతో పోరాడిన మహేశ్వరి చివరకు తుదిశ్వాస విడిచింది. మహేశ్వరి మృతితో ఆమె ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోగా, కుటుంబ సభ్యుల రోదనలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. పది రోజుల క్రితమే తమతో కలిసి నవ్వుతూ దిగిన సెల్ఫీలు ఇప్పుడు చూసుకోలేక తోటి స్నేహితులు కన్నీరుమున్నీ రవుతున్నారు. "ఇదేనా మన చివరి ఫోటో..?" అంటూ ఆమె స్నేహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు దశాబ్దాల తర్వాత కలిసిన బాల్య స్నేహం... కేవలం పది రోజుల వ్యవధిలోనే విషాద వీడ్కోలుగా మారడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

# అక్రమ కేసులు ఎత్తివేయాలి




**తొలి అక్షరం/మహబూబాద్ బ్యూరో మే 29:** ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వెయ్యాలని వామపక్ష నాయకులు బి విజయ సారధి, గౌని ఐలయ్య, ఆకుల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు నాడు ఆర్టీసీ నీ ప్రభుత్వంలో విలీనం చేయాలని, నల్ల చట్టాలు రద్దు చేయాలని సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ల ఆధ్వర్యంలో చేసిన పోరాటంలో భాగంగా పెట్టిన అక్రమ కేసులో శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష నేతలపై గత బిఆర్ఎస్ బిజెపి ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో అక్రమంగా ఉద్యమిస్తున్న వామపక్ష పార్టీ నేతలపై ఆర్టీసీ ఉద్యమంలో భాగంగా కేసులు పెట్టారని వాటిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు నల్ల చట్టాలు రద్దు చేయాలని చేసిన పోరాటంలో భాగంగా కేసులు పెట్టారని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

వామపక్షాల పోరాటాల ఫలితంగా మోడీ వినికితగి నల్ల చట్టాలను రద్దు చేస్తామని తెలిపారని నాడు అది వామపక్షాల విజయమన్నారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కోర్టుకు హాజరైన వారిలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి గుణగంటి రాజన్న హెచ్ లింగ్య నాయక్ పెరుగు కుమార్ రేషపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న మామిండ్ల సాంబలక్ష్మి చొప్పరి శేఖర్ నర్రా శ్రావణ్ ఎండి ఫాతిమా సమ్మెట రాజమౌళి గుజ్జు దేవేందర్ ఆలకుంట్ల సాయిలు గౌని వెంకన్న సామ పాపయ్య కూరాకుల పాల్ ఎర్రోజు పద్మ షంషీర్ లక్ష్మీన రసు ఎండి అలీమా కనకం పద్మ తండా వినోద సుజా త స్వరూప శ్రీలత మధుకర్ రమేష్ కవిత ఉన్నారు.

# ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వనప్రేమికుడికి ఘనసన్మానం

**• నవత ఆటో యూనియన్ అధ్యక్షుడు మోడెం సురేష్**




**తొలి అక్షరం/నెక్కొండ మే 29:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో లూసియానా యూనివర్సిటీ అమెరికా వారిచే అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డును ఇటీవల పూణేలో వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య అందుకోబడిన సందర్భంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో.. వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్యని,నెక్కొండ మండల నవత ఆటో యూనియన్ అధ్యక్షుడు మోడెం సురేష్ చే ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వనప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య మరెన్నో అవార్డులను అందుకోవాలని.. యువకులు, ప్రజలు సమ్మయ్య ని ఆదర్శంగా తీసుకొని చెట్లను పెంచాలని అభిలాషించారు. తనను సత్కరించడం ఆనందంగా ఉందని తెలియజేస్తూ.ముందు ముందు ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేయుటకు నాకు స్ఫూర్తినీ నింపిందని.. వన ప్రేమికుడు సమ్మయ్య తెలిపినారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పెండ్యాల రాజు, సీనియర్ ఆటో డ్రైవర్స్ ఈదునూరి రామచందర్, సుభాష్, వేణు, అమీర్, అంతయ్య, వేణు, శీను, బోలుగొడ్డు సురేష్, అరవింద్, వెంకటేష్, నరసింహా..తదితర నెక్కొండ మండల నవత ఆటో యూనియన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

# నరసింహులపేట కాంగ్రెస్‌లో ముదురుతున్న 'మండలాధ్యక్ష' పీఠం పోరు..!

● నలుగురి మధ్య హోరాహోరీ పోటీ.. ఆశావహుల్లో పెరుగుతున్న ఉత్కంఠ! ● బీసీ కార్డా..? సీనియార్టీ ఫార్ములానా..? ఎమ్మెల్యే మౌనం వెనుక రాజకీయ లెక్కలేనా..? ● అధికారంలో ఉన్న పార్టీకి ఈ అంతర్గత కుమ్ములాటలెందుకు..? ● మండల కాంగ్రెస్‌లో అసలు ఎవరి మాటే ఫైనల్..?





**తొలి అక్షరం/నరసింహుల పేట మే 29:** నరసింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో తీవ్ర కాక రేపుతోంది. రాష్ట్రంలో అధికార పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పార్టీ పీఠాన్ని దక్కించుకునేందుకు నాయకులు ఉత్సాహం చూపడం సహజమే అయినా, ఇక్కడ నెలకొన్న అంతర్గత పోటీ మాత్రం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మండల అధ్యక్ష పదవి కోసం ఏకంగా నలుగురు కీలక నేతలు గట్టిగా రేసులో నిలబడటంతో కాంగ్రెస్ శిబిరంలో వేడి రాజకీయం మొదలైంది. అధిష్టానం త్వరలోనే అధికారిక ప్రకటన చేయనుందనే ప్రచారంతో ఆశావహులంతా తమ తమ రాజకీయ బలాలు, సామాజిక సమీకరణాలు, ఎమ్మెల్యేతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆయుధాలుగా మార్చుకుని పావులు కదుపుతున్నారు. అయితే ఎవరికి అవకాశం దక్కబోతోందన్నది మాత్రం ఇప్పటికీ సస్పెన్స్‌గానే మారింది. **యువనేతకు అవకాశం ఇస్తారా..?** ఈ పోటీలో ఉన్న ఒక యువ నాయకుడు పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలంటే యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని బలంగా వాదిస్తున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో కలిసి పనిచేసే తత్వం తనదేనని, సోషల్ మీడియా నుంచి గ్రామస్థాయి వరకు పార్టీని పరుగులు పెట్టించగలననే ధీమాతో ఆయన ఉన్నారు. "ఈసారి యువరక్తానికే ఛాన్స్ ఇవ్వాలి కదా..?" అనే వాదనను ఆయన వర్గం నియోజకవర్గ వ్యాప్తంగా గట్టిగా వినిపిస్తోంది. **మాజీ సర్పంచ్‌కే పట్టం కడతారా..?** మరోవైపు రేసులో ఉన్న ఒక మాజీ సర్పంచ్ కూడా గ్రామీణ స్థాయిలో తనకున్న పట్టును నమ్ముకుని ముందుకు సాగుతున్నారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, ప్రజలతో నేరుగా మమేకమయ్యే స్వభావం తనకు కలిసివస్తాయని భావిస్తున్నారు. "గ్రామ స్థాయి సమస్యలు, స్థానిక సమీకరణాలు తెలిసిన వారికే పార్టీ బాధ్యత ఇస్తే మైలేజ్ ఉంటుంది" అంటూ ఆయన అనుచరులు డిమాండ్ చేస్తున్నారు. సీనియర్ల అసంతృప్తి భయపెడుతోందా..? ఇదే సమయంలో రేసులో ఉన్న ఇద్దరు సీనియర్ నేతలు మాత్రం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండాలు మోసింది తామేనని స్పష్టం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకుని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లాఠీ దెబ్బలు తిని పనిచేసిన తమను పక్కనపెడితే అది నిబద్ధత కలిగిన కార్యకర్తలకు తప్పుడు సంకేతం పంపినట్లవుతుందని హెచ్చరిస్తున్నారు. "కష్టపడిన వారిని కాదని కొత్తవారికి ఇస్తే రేపటి రోజున పార్టీ కోసం ఎవరు నిలబడతారు..?" అనే ప్రశ్నను సీనియర్లు అధిష్టానం ముందుంచుతున్నారు. **ఎమ్మెల్యే చుట్టూ లాబీయింగ్ రాజకీయాలు..!** మండలాధ్యక్షుడి ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయమే అత్యంత కీలకం కానుండటంతో, ఆశావహులైన నలుగురు నాయకులు ఆయనను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్రంగా పోటీపడుతున్నారు. ప్రతిరోజూ నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో హాజరు కావడం, పార్టీ సమావేశాల్లో చురుకైన పాత్ర పోషించడం, తమ అనుచరుల బల ప్రదర్శన చేయడం ద్వారా ఎమ్మెల్యే దృష్టిలో పడేందుకు ఎవరి లాబీయింగ్ వారు నడుపుతున్నారు. అయితే ఎమ్మెల్యే మాత్రం ఇప్పటివరకు ఎవరిపైనా స్పష్టమైన సంకేతాలు ఇవ్వకుండా 'ఆచి తూచి' వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకరికి అవకాశం ఇస్తే మిగతా ముగ్గురు అసంతృప్తితో పార్టీ కార్యక్రమాలకు దూరమవుతారనే ఆందోళన ఆయనలో స్పష్టంగా కనిపిస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. **బీసీలకు ప్రాధాన్యత ఇస్తారా..?** ఇక్కడే ఇప్పుడు మరో సామాజిక సమీకరణ చర్చ తెరపైకి వచ్చింది. "రాబోయే రోజుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇస్తాం" అని గతంలో ఎమ్మెల్యే చేసిన కొన్ని వ్యాఖ్యలను బీసీ నేతలు గుర్తు చేస్తున్నారు. మరి నిజంగానే బీసీ అభ్యర్థికే పదవి ఇచ్చి సామాజిక న్యాయం చేస్తారా..? లేక ఓసీ నాయకత్వానికే మొగ్గు చూపుతారా..? లేక ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పిస్తారా..? అన్న ప్రశ్నలు మండలవ్యాప్తంగా వినబడుతున్నాయి. **అధికార పార్టీలోనే ఎందుకీ రాద్ధాంతం..?** మండల ప్రజల్లో ఇప్పుడు ఒకే చర్చ జరుగుతోంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోనే ఎందుకు ఇంత హడావిడి..? ఎందుకు ఇంతటి అంతర్గత కుమ్ములాట..? ప్రతి పదవి విషయంలోనూ గ్రూపు రాజకీయాలు రచ్చకెక్కడం వెనుక అసలు కారణమేంటి..? అనే ప్రశ్నలు విపక్షాలకు సైతం అస్త్రాలుగా మారుతున్నాయి. "ఇతర పార్టీల కంటే కాంగ్రెస్‌లోనే ఎక్కువగా వర్గపోరు కనిపిస్తుండటం ఏంటి..?" అని రాజకీయ పరిశీలకులు కూడా పెదవి విరుస్తున్నారు. **ఎవరికి దక్కబోతోంది కాంగ్రెస్ పీఠం..?** నలుగురు నేతల మధ్య హోరాహోరీ పోటీ, సామాజిక సమీకరణాలు, కార్యకర్తల ఒత్తిళ్లు, ఎమ్మెల్యే రాజకీయ లెక్కలు... ఇవన్నీ కలిసి నరసింహులపేట కాంగ్రెస్ రాజకీయాలను మరింత రసవత్తరంగా మార్చేశాయి. మరి చివరకు కాంగ్రెస్ మండల పీఠం ఎవరి ఖాతాలో పడబోతోంది..? సీనియారిటీ గెలుస్తుందా..? యువరక్తానికి అవకాశం దక్కుతుందా..? లేక బీసీ ఫార్ములా అమలవుతుందా..? అన్నది తెలియాలంటే అధిష్టానం అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే!

# అధినేత అందుబాటులో లేకున్నా తక్షణమే స్పందన

● కామ్రేడ్ భాస్కర్ రెడ్డి కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ క్వింటాల్ బియ్యం! ● కార్మిక నేత, సీపీఐఎం న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ కన్నంత రెడ్డి భాస్కర్ రెడ్డి అకాల మృతి ● భాస్కర్ రెడ్డి కుటుంబ పరిస్థితి తెలిసిన వెంటనే తాను లేకపోయినా ఫోన్ లోనే స్పందించి సాయం పంపిన చిలువేరు సమ్మయ్య ● సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ ఆసరాగా క్వింటాల్ బియ్యం పంపిణీ ● పార్టీలు, రాజకీయాలకు అతీతంగా కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎప్పుడూ ముందే: సీపీఐఎం నేతల ప్రశంసలు ● ప్రజల కోసం పోరాడిన నాయకుడి కుటుంబానికి అండగా నిలిచిన సమ్మయ్య సేవలు సమాజానికి ఆదర్శం: సామల నర్సయ్య




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మే 29:** ఆపదలో ఉన్నామన్న మాట వినబడితే చాలు.. తాను ఎక్కడున్నా స్పందించి నేనున్నానంటూ ముందుకొచ్చే మహోన్నత సేవా నిరతి సమ్మిగౌడ్ ఫౌండేషన్ సొంతం. రాజకీయాలకు అతీతంగా, కులమతాల బేధాల్లేకుండా ఆపన్న హస్తం అందించడమే ధ్యేయంగా ఈ ఫౌండేషన్ ప్రస్థానం సాగుతోంది. ఇటీవల అకాల మరణం చెందిన సీపీఐఎం న్యూ డెమోక్రసీ నాయకుడు కామ్రేడ్ కన్మంత రెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ తక్షణ సహాయంగా ఒక క్వింటాల్ బియ్యాన్ని అందించి, తమదైన శైలిలో భరోసానిచ్చింది. ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య స్థానికంగా అందుబాటులో లేకపోయినా, విషయం తెలిసిన వెంటనే ఫోన్ లో స్పందించి మరీ బియ్యాన్ని పంపించడం ఇక్కడి వారిని ఎంతగానో కదిలించింది. తాను లేకపోయినా సాయం ఆగిపోకూడదనే సమ్మయ్య ఆలోచన అసలైన మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. **ప్రజా పోరాటాల యోధుడు భాస్కర్ రెడ్డి అమరత్వం:** ప్రజా సమస్యల పరిష్కారమే శ్వాసగా, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడిన అరుదైన నాయకుడు కామ్రేడ్ కన్మంత రెడ్డి భాస్కర్ రెడ్డి. కేసముద్రం సీపీఐఎం న్యూ డెమోక్రసీ నాయకుడిగా, భారత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యుడిగా ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివి. నిరంతరం ప్రజల కోసమే తపించిన ఆ నిబద్ధత గల నాయకుడు ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశాడు. ఆయన స్వగ్రామమైన ఈదుల పూసపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. భాస్కర్ రెడ్డి మరణం పార్టీలకే కాకుండా, యావత్ ప్రజా సంఘాలకు, కార్మిక లోకానికి తీరని లోటని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. **తాను లేకున్నా తక్షణమే స్పందించిన చిలువేరు సమ్మయ్య:** పోరాటాల నాయకుడు భౌతికంగా దూరమవ్వడంతో ఆయన కుటుంబం తీవ్ర శోకసముద్రంలో మునిగిపోయింది. ఈ క్లిష్ట పరిస్థితిని పార్టీ జిల్లా నాయకులు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో సమ్మయ్య వ్యక్తిగత పనుల వల్ల అందుబాటులో లేడు. అయినప్పటికీ, విషయం తెలిసిన మరుక్షణమే ఆయన స్పందించిన తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. తాను ఎక్కడున్నా పేదవాడి ఆకలి, బాధే ముఖ్యం అనుకుంటూ.. ఫౌండేషన్ ప్రతినిధులను పురమాయించి తక్షణ సహాయం కింద ఒక క్వింటాల్ బియ్యాన్ని ఆ కుటుంబానికి చేర్చాడు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి ఈ సాయం ఎంతో ఆసరాగా నిలిచింది. **సమాజానికి ఆదర్శం సమ్మిగౌడ్ ఫౌండేషన్:** సమ్మిగౌడ్ ఫౌండేషన్ చేసిన ఈ తక్షణ సాయంపై సీపీఐఎం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎం జిల్లా నాయకుడు కామ్రేడ్ బండ్లపల్లి వెంకటేశ్వర్లు, సామల నర్సయ్య మాట్లాడుతూ.. "రాజకీయాలు, పార్టీలు ఏవైనా కావచ్చు.. కానీ కష్టం వస్తే స్పందించే గుణం సమ్మిగౌడ్ ఫౌండేషన్ ప్రత్యేకత. అధినేత ఇక్కడ లేకపోయినా వెంటనే స్పందించి ఆదుకోవడం నిజమైన సేవా గుణానికి నిదర్శనం. సమ్మయ్య చేస్తున్న ఇటువంటి సేవలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రజల కోసం పోరాడిన నాయకుడి కుటుంబానికి తోడుగా నిలిచిన వ్యక్తి సమ్మయ్య" అని కొనియాడారు. ప్రచారాల కోసం కాకుండా, గుండెల్లోంచి వచ్చే సేవాభావంతో సమ్మయ్య చేస్తున్న పనులు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయని నేతలు పేర్కొన్నారు. ఈదుల పూసపల్లిలో జరిగిన ఈ సాయం పంపిణీ కార్యక్రమంలో సీపీఐఎం డివిజన్ నాయకుడు కామ్రేడ్ షేక్ మౌలానాతో పాటు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ అందించిన ఈ ఆసరా పట్ల కామ్రేడ్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## చిన్నారిని ఆశీర్వదించిన వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ మే 29:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామ బి ఆర్ యస్ నాయకులు చెవ్వా సంపత్-మమత ల కూతురు నవ్య శ్రీ సారి ఫంక్షన్ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి,ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మెంబర్ గటిక అజయ్ కుమార్ ,నెక్కొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంగని సూరన్న,సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్,మాజీ ఎంపీపీ జాటోత్ రమేష్ నాయక్,మండల నాయకులు బొల్లెబోయిన వీరస్వామి,కారింగుల సురేష్ గౌడ్,ఈదూనూరి వెంకన్న,మాతంగి రాజు,గ్రామ సర్పంచ్ పున్నం రంగారెడ్డి,విజయ వీరునాయక్,మాజీ సర్పంచ్ కోర్లపాటి ప్రభాకర్,అశోక్,మాజీ సర్పంచ్ వీరు నాయక్,ఉప సర్పంచ్ కావటి కుమార్,మాజీ ఉప సర్పంచ్ అశోక్,విరస్వామి,సీతారాంపురం గ్రామ పార్టీ అధ్యక్షులు చెవ్వా రాజ్ కుమార్,తిప్పాని సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 29:** ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక తాహశీల్దార్ రాజేశ్వరరావు అధ్యక్షతన కల్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తుందని, మొత్తం మండల కేంద్రానికి గాను పట్టణ కేంద్రానికి గాను లికల్యాణ లక్ష్మి షాది ముబారక్ 122, సీఎంఆర్ఎఫ్ 44 చెక్కులను లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్మన్ గూగుల్ జ్యోతి రమేష్ నాయక్,మహబూబాబాద్ మండల అధ్యక్షులు , వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ సీనియర్ నాయకులు లబ్ధిదారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుమారి తొగరు అక్షయ, రాహుల్‌ను ఆశీర్వదించిన చిన్న కొర్పోల్ గ్రామ సర్పంచ్ భానుతు అనిత - బద్రు నాయక్



**తొలి అక్షరం/నెక్కొండ మే 29:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కొర్పోల్ గ్రామంలో తొగరు హైమా -యాకయ్య కూతురు అక్షయ, రాహుల్ చీరగట్టించుట, దోతి కట్టించుట ఫంక్షన్ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన చిన్న కొర్పోల్ గ్రామ సర్పంచ్ బానోతు అనిత-బద్రు నాయక్, అదే విధంగా చిన్న కొర్పోల్ మాజీ సర్పంచ్ కర్ర వెంకటరెడ్డి, తొగ్గరు యాకన్న చిన్ననాటి మిత్రులు తొగరు శ్రీనివాస్, ఫుల్ సింగ్, గజ్జెల సంతోష్, ఇండ్ల సతీష్, చింతల యాకన్న, గంగపురి శ్రీను, చిరబోయిన యాకాంబరం, బానోతు రాజు, తొగరు శ్రీకాంత్, చిన్న కొర్పోల్ గ్రామం కారోబార్ పిట్టల రాజు, పాల్గొని చిన్నారులు ఆశీర్వదించడం జరిగింది.

# చిన్నారిని ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్



**తొలి అక్షరం/నెక్కొండ మే 29:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలోని రామాలయ బిసి కాలనీకి చెందిన మహమ్మద్ షహనా –షరీఫ్ పుత్రిక అయోషా నూతన పుష్పలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్,జిల్లా కార్యదర్శి కుసుమ చేన్నకేశవులు చల్లా శ్రీపాల్ రెడ్డి , జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, ఉపసర్పంచ్ & యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం శ్రావణి ప్రశాంత్,వార్డు సభ్యులు మహ్మద్ అమీర్,యూత్ నాయకులు,చీనూరి కార్తీక్,సింగం శ్రీకాంత్,మహ్మద్ రజీయ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ మే 29:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి చెందిన దివంగత శ్రీ సుదనపు ఉపేందర్ కుటుంబానికి, టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి,మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం (75 కిలోల బియ్యం) అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ శ్రీ బెజ్జంకి వెంకటేశ్వర్లు ఉపసర్పంచ్ శ్రీమతి సింగం శ్రావణి – ప్రశాంత్ నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివ కుమార్ వార్డు సభ్యులు శ్రీమతి రామరాపు శిరీష – రాము దేవానబోయిన విజేందర్ కాంగ్రెస్ నాయకులు , సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీ బూర్గు నరేష్, లైశెట్టి వినయ్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 6 ఎకరాల జమాయిల్ తోటలు దగ్ధం



**తొలి అక్షరం/నర్సింహులపేట,మే29:** మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేట మండలం కౌసల్య దేవిపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో 6 ఎకరాల జామయిల్ తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు కటుకూరి సంజీవరెడ్డి మరియు వేర్పుల శ్రీరాములు వారికి చెందిన జమయిల్ తోటలు మంటల్లో కాలిపోయాయి. స్థానికుల వివరాల ప్రకారం, తెల్లవారుజామున ప్రాంతంలో భారీ ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి షార్ట్సర్క్యూట్ ఏర్పడింది. దీంతో చెలరేగిన మంటలు సమీపంలోని జామ తోటలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కటుకూరి సంజీవరెడ్డికి చెందిన సుమారు 5 ఎకరాల జామయిల్ తోటతో పాటు వేర్పుల శ్రీరాములు కు చెందిన మరో ఒక ఎకరా జామయిల్ తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మంటలు వేగంగా వ్యాపించడంతో రైతులు, గ్రామస్తులు కలిసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

# తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ఎల్‌బి నగర్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్‌గా అమరోజు రవి కుమార్ నియామకం




**తొలి అక్షరం/రామన్నపేట మే 29:** ప్రకృతి ప్రసాదించిన భూమికి విలువను ప్రసాదించగల ఏకైక వ్యక్తి రియల్ ఎస్టేట్ ఏజెంట్. ఆ ఏజెంట్ ల సహాయం సహకారం లేకుండా వ్యాపారం చేయడం చాలా కష్టతరం. భూమి విలువను ప్రపంచానికి తెలియజేసేది ఏజెంట్. రియల్ ఎస్టేట్లో ఇండస్ట్రీలను తక్కువ సమయంలో కోట్లకు పడగలెక్కించిన ఏకైక రంగం రియల్ ఎస్టేట్ రంగం. ప్లాట్లు, ఇండ్లు, భూములు కొన్న దగ్గర నుండి రిజిస్ట్రేషన్ అయ్యేదాకా నిజాయితీగా సేవలందించేవారు ఏజెంట్లు. అలాంటి ఏజెంట్లకు ప్లాట్లు భూములు కొనిపించిన, అమ్మించిన వారికి అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ అసోసియేషన్ బలోపేతం కోసం లితెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అండగా ఉంటున్నదని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు గత కొన్ని సంవత్సరాలనుండి రియల్ ఎస్టేట్ రంగంలో ఆధారపడి రియల్ ఎస్టేట్ రంగాన్నే నమ్ముకున్న రియల్టర్స్ కీ అండగా ఆసరాగా బాసరగా నిలబడి కొట్లాడి రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్న రియల్టర్స్ అందరికీ నేను అండగా ఉంటామని ఎల్ బి నగర్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ గా అమరోజు రవి కుమార్ కీ నియామపాక పత్రం అందచేయడం జరిగింది.

# ఖబ్జా కోరులను ఉపేక్షించేది లేదు..

## నగర అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు

## ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం..

## గతపాలకుల నిర్వాకంతో అభివృద్ధికి ప్రభుత్వ స్థలాలు కరువు..

## రూ.103 లక్షలతో 30,31 డివిజన్ లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని..

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** మహా నగరంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం,అధికారులు చర్యలు చేపడుతున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.సోమవారం రోజున 30,31 దివిజన్ పరిధిలలో రూ 103 లక్షలతో సైడ్ డ్రైనేజీ,అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.నిర్ణీత గడువులోగా పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టేలా చూడాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాయంపేట డివిజన్ గ్రామీణ వాతావరణంలో నుంచి పట్టణ వాతావరణం దిశగా అభివృద్ధి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.మా హయాంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నియోజ వర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు,నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.గత పదేళ్లలో ప్రజలను మోసం,ఎన్నో భూములను కబ్జా చేసి ఇంకా సరిపోలేదని ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో దేవుడి పేరుతో భూములను కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఇంట్లో కుటుంబ సభ్యులకు అన్యాయం చేసి నాపై మాట్లాడటం సిగ్గుచేటు.గడిచిన రెండున్నర ఏళ్లలో ఎక్కడైనా భూములు ఖబ్జాలు ఉన్నాయా అని ప్రశ్నించారు.దేవుడి పేరుతో నువ్వు చేసిన మోసం అన్ని కూడా వీడియో అధరాలతో ఉన్నాయని ఎక్కడో వేరే రాష్ట్రం నుంచి తీసుకువచ్చి పురాతన విగ్రహం అనడం ఎందుకు అని ప్రశ్నించారు.గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన నీకు పురాతన విగ్రహాలు దొరికితే పురావస్తు శాఖ అధికారులు ఎందుకు చెప్పలేదు అని మండిపడ్డారు.భద్రఖాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా అడ్డుపడుతున్నావ్,నీ హయాంలో శాయంపేట లో జరిగిన కబ్జాలు అన్ని ప్రజలకు తెలుసన్నారు.నేను 5 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న పర్వాలేదు కానీ నా హయాంలో భూ కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా సరే క్షమించను అన్నారు.ప్రజల నుంచి మాట రాకుండా,మచ్చ లేని పరిపాలన అందివ్వడమే





లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు.రాజకీయంగా పరిపాలన పరమైన విమర్శలు చేయాలి కానీ ఇష్టమొచ్చిన మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు .మీరు మారుతారని ఆశిస్తు ఇన్ని రోజులు ఓపికపట్టామని అన్నారు.ఇలాంటి భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వం మరియు వ్యక్తిగత భూములను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ మహా నగర పాలక సంస్థ మెప్మా హనుమకొండ ఆధ్వర్యంలో బొక్కల గడ్డ లోని సిటిజన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మహిళా సమైక్య సంఘాల 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మహిళా సమైక్య గ్రూపుల ద్వారా ఆదాయ మార్గాలు ఏర్పరుచుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకుంటున్న మహిళలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. జరిగిన సభలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తోందన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ,ఆర్థికాభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం,సమాజం,రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి నూతన పథకం ప్రజలకు చేరాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే ఆర్పీలు,మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే అన్నారు.సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా మహిళా సంఘాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.పార్టీలకు అతీతంగా ప్రజాసేవ చేస్తున్న మహిళా సంఘాలకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళా సమైక్యలకు స్థానిక ఎమ్మెల్యేగా అన్ని విధాలుగా అండగా ఉంటానని,వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు తన







వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,ఓబీసీ చైర్మన్ బొమ్మతి విక్రమ్,డివిజన్ అధ్యక్షులు శివాజీ మెప్మా అధికారులు,కార్పొరేటర్లు,మహిళా సంఘాల ప్రతినిధులు,ఆర్పీలు,స్వయం సహాయక సంఘాల సభ్యులు,ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఈనెల 31న హైదరాబాదులో జరిగే ఉద్యమకారుల ప్రతినిధి సభను జయప్రదం చేయండి: జోగు అంజన్న




**తొలి అక్షరం/వలిగొండ మే 29:** ఈనెల 31న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సభకు ఉద్యమకారులు అందరు హాజరై జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఉద్యమకారుల ఫోరం ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టేందుకు ఉద్యమకారులను గుర్తించేందుకు కేకే కమిటి వేయడం హర్షనీయమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేకే కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం కేకే కమిటీ ముఖ్య నాయకులు ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులతో భేటీలో పాల్గొని ఉద్యమకారుల ఫోరం నాయకుల సలహాలు సూచనలు స్వీకరిస్తారు. కావున ఉద్యమకారులందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య, జిల్లా కార్యదర్శి బత్తిని రవీందర్ గౌడ్, కదిరేణి స్వామి,మల్లం వెంకటేశం,బొడిగె సుదర్శన్,ఐటి పాముల పుష్పమ్మ, ఎక్కల దేవి శ్రీనివాస్, కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండ మండలంలోని గ్రామాలను అభివృద్ధి చేస్తాను



**తొలి అక్షరం:/వలిగొండ మే 29:** వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో కర్ణకంటి కమలమ్మ యాదయ్య గారి గ్రామ ప్రజల సమక్షంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది వెంకటాపురం గ్రామపంచాయతీ ప్రారంభోత్సవం చేయడానికి ట్యాంక్ రిపేరు పైపులైను సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కరెంటు స్తంభాలు మిగతా అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడం జరిగింది



# చలో హైదరాబాద్

**తొలి అక్షరం/రామన్నపేట మే 29:** తెలంగాణ ఉద్యమకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ సభ్యులతో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలి గత కొన్ని సంవత్సరాల నుండి ఉద్యమకారులను గుర్తించడానికి వారి సమస్యలను మరియు వారి త్యాగాలను ఈ ప్రభుత్వం ఉద్యమంలో నష్టపోయినటువంటి ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం ఈ నెల 31 వ తారీకు ఉద్యమకారుల యొక్క సూచనలు సలహాలు వారి యొక్క ఉద్యమకారుల అభిప్రాయాలు తెలుసుకోవడం కోసం ఈ యొక్క కమిటీ ఏర్పాటుకు టి యు టి ఫ్ వ్యవస్థాపకులు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నారు కావున ఈ యొక్క సమావేశానికి ఉమ్మడి పది జిల్లాల అధ్యక్షులు మండల అధ్యక్షులు జిల్లా నాయకులు ఉద్యమ నాయకులు యొక్క సదస్సు విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నా ఇట్లు బొడ్డుపల్లి లింగయ్య తెలంగాణ ఉద్యమ నాయకులు విలేకరుల సమావేశంలో చెప్పడం జరిగింది

# సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న పంత్




లక్నో సూపర్ జెయింట్స్ సంచలన ప్రకటన చేసింది. తమ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించింది. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తికాక ముందే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సీజన్‌లో లక్నో జట్టు పంత్ నాయకత్వంలో ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో కెప్టెన్సీ బాధ్యతల నుంచి తనను తప్పించాల్సిందిగా పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంచైజీ అంగీకరిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది.లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తిగా ముగియకముందే.. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని ఆ ఫ్రాంఛైజీ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఐపీఎల్ 2026లో పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ దారుణ ప్రదర్శన చేసింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో పంత్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు."లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత ఈజీ కాదు. కెప్టెన్‌గా రిషభ్ పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి గొప్పగా సేవలందించాడు" అని లక్నో సూపర్ జెయింట్స్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. వచ్చే సీజన్‌కు ముందు టీమ్‌ను పునర్నిర్మించడంపై తాము ఫోకస్ పెట్టినట్లు వెల్లడించింది.కాగా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కెరీర్ ఆరంభించిన రిషభ్ ఫంత్.. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు అనూహ్యంగా ఆ జట్టును వీడాడు. దీంతో ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వచ్చేశాడు. ఇతర జట్లతో పోటీ పడి మరి లక్నో సూపర్ జెయింట్స్.. రికార్డు ధర రూ.27 కోట్లు వెచ్చించి.. పంత్‌ను దక్కించుకుంది. వెంటనే కెప్టెన్‌ను చేసింది. అయితే కెప్టెన్‌గా, ఆటగాడిగా పంత్ పూర్తిగా విఫలమయ్యాడు.లక్నో సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్ సారథ్యంలో గత సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరకుండానే నిష్క్రమించింది. ఈ సీజన్‌లో అయితే ఇంకా దారుణ ప్రదర్శన చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. మొత్తంగా పత్ సారథ్యంలో లక్నో.. రెండు సీజన్లలో కలిపి కేవలం 10 మ్యాచ్‌లలో మాత్రమే గెలిచింది. మరోవైపు బ్యాటర్‌గా కూడా పంత్ విఫలమయ్యాడు. ఐపీఎల్ 2025లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది 312 పరుగులు సాధించాడు. దీంతో విమర్శలపాలయ్యాడు.

# స్మృతి మంధాన గోల్డెన్ డకౌట్




ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత మహిళా జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో స్మృతి ఇన్నింగ్స్ తొలి బంతికే డకౌట్ అయింది. ఇప్పటి వరకు టీమిండియా తరఫున ఇన్నింగ్స్ తొలి బంతికే ఎవ్వరూ డకౌట్ కాలేదు.. ఈ చెత్త రికార్డు అందుకున్న తొలి బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్, యస్తికా భాటియా రాణించడంతో భారత్ భారీ స్కోర్ చేసి 38 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది.ఐసీసీ మహిళల టీ 20 వరల్డ్‌కప్ ముందు టీమిండియా ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడుతోంది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా చెమ్స్‌ఫోర్డ్‌లో గురువారం తొలి మ్యాచ్ జరగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా టెంపరరీ కెప్టెన్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది.టీమిండియా ఇన్నింగ్స్ ఆరంభించిన స్మృతి మంధాన తొలి బంతికే అవుటయింది. ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్ వేసిన బంతిని డిఫెండ్ చేయగా అది చార్లీ డీన్ చేతుల్లోకి వెళ్లింది. దాంతో స్మృతి మంధాన మొదటి బంతికే డకౌట్ అయింది. టీమిండియా ఉమెన్స్ టీ20 చరిత్రలో మొదటి బంతికే డకౌట్ అయిన తొలి బ్యాటర్‌గా చెత్త రికార్డును మూటగట్టుకుంది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో భారత మహిళల తరఫున అత్యధిక పరుగులు చేసిన స్మృతి మంధానకు ఇది ఆరో డకౌట్. టీమిండియా ఉమెన్స్ జట్టులో టీ20ల్లో అత్యధిక డకౌట్స్ అయిన ప్లేయర్‌గా మాత్రం షెఫాలీ వర్మ ముందు వరుసలో ఉంది. షెఫాలీ వర్మ ఏడు డకౌట్లతో మొదటి స్థానంలో ఉండగా.. టీమిండియా కెప్టెన్ హర్మత్ ప్రీత్ కౌర్ 6, స్మృతి మంధాన 6, జెమీమా రోడ్రిగ్స్ 6, దీప్తి శర్మ ఆరుసార్లు డకౌట్ అయ్యి ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. ఇక తొలి టీ20 మ్యాచ్‌కి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దూరమైంది. ఎలాంటి గాయం కానీ, ఫిట్‌నెస్ సమస్య కానీ లేదని.. కేవలం విశ్రాంతి కోసమే ఆమె దూరమైనట్లు టాస్ సమయంలో స్మృతి మంధాన తెలిపింది. మిగతా మ్యాచ్‌లకు హర్మన్ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే తొలి బంతికే వికెట్ కోల్పోయిన టీమిండియా ఈ మ్యాచ్‌లో మంచి స్కోరే నమోదు చేసింది. షెఫాలీ వర్మ కూడా 2 పరుగులకే అవుటవ్వడంతో మొదటి ఓవర్‌లోనే భారత్ ఓపెనర్లు ఇద్దర్నీ కోల్పోయింది. ఆ తర్వాత యస్తిక భాటియా, జెమీమా రోడ్రిగ్స్ కలిసి టీమిండియా స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. భాటియా 54, రోడ్రిగ్స్ 69 పరుగులు చేయగా ఆఖర్లో దీప్తి శర్మ 22 పరుగులు చేయడంతో భారత్ 188/7 పరుగులు చేసింది. భారత్ అందించిన 189 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ వికెట్ కీపర్ ఎమీ జోన్స్ 67 పరుగులతో పోరాడినప్పటికీ 20 ఓవర్లలో 150/8 పరుగులు మాత్రమే చేసింది. దాంతో టీమిండియా 38 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఆధిపత్యంలో ఉంది.

# భారత క్రికెట్‌లోకి వైభవ్ సూర్యవంశీ ఆగమనం

దిహేనేళ్ల వయసులో పిల్లలు ఆటపాటలతో కాలం గడుపుతారు. కానీ, ఆ పాలబుగ్గల చిన్నారి మాత్రం ప్రపంచ స్థాయి మేటి బౌలర్లను తన బ్యాట్‌తో చీల్చి చండాడుతున్నాడు. ఐపీఎల్‌లో పరుగుల విధ్వంసం సృష్టిస్తున్న ఈ సంచలన ఆటగాడిపై తాజాగా క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా లోకంలో దావానలంలా వ్యాపించాయి.రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగి ఐపీఎల్ 2026 సీజన్‌ను ఊపేస్తున్న వైభవ్ సూర్యవంశీ ఆటతీరుకు యావత్ క్రికెట్ ప్రపంచం ఫిదా అవుతోంది. మొన్నటి ఎలిమినేటర్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు బాది ఈ యువ సంచలనం సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. ప్రపంచంలోనే అత్యుత్తమ కెప్టెన్, బౌలర్ అయిన పాట్ కమిన్స్ సైతం మూడు ప్రత్యేక ప్రణాళికలతో బరిలోకి దిగి కూడా వైభవ్‌ను కట్టడి చేయలేకపోయానంటూ చేతులెత్తేయడం ఈ కుర్రాడి సత్తాకు నిదర్శనం. ఆ మ్యాచ్‌లో క్యాచ్ అవుట్ కాకుండా ఒక్క బౌండరీ కొట్టి ఉంటే, క్రిస్ గేల్ పేరిట ఉన్న మరికొన్ని రికార్డులు కరిగిపోయేవి. ఇప్పటికే ఒకే సీజన్‌లో 65 సిక్సర్లు బాది, గేల్ నెలకొల్పిన 59 సిక్సర్ల రికార్డును ఈ చిచ్చరపిడుగు ఎప్పుడో బద్దలు కొట్టాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం అడుగు పెట్టకుండానే, ఐపీఎల్ వేదికగా ప్రపంచంలోని అగ్రశ్రేణి బౌలర్లను వణికిస్తున్న




వైభవ్ సూర్యవంశీని తక్షణమే భారత జట్టులోకి తీసుకోవాలంటూ సోషల్ మీడియాలో అభిమానులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో టీం ఇండియా మాజీ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఒక సంచలన విషయాన్ని బయటపెట్టాడు. రాబోయే జులై నెలలో ఇంగ్లాండ్ వేదికగా జరిగే టీ20 సిరీస్ ద్వారా వైభవ్ సూర్యవంశీ భారత జట్టులోకి అరంగేట్రం చేయడం ఖాయమని గవాస్కర్ స్పష్టం చేశాడు. అప్పటివరకు ఈ అద్భుతమైన ఆటగాడిని ప్రత్యర్థి జట్లకు దొరకకుండా బీసీసీఐ ఒక రహస్య ఆయుధంగా దాచిపెడుతోందని గవాస్కర్ పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో టీం ఇండియా ఎంతో బలంగా ఉంది. ఇలాంటి తరుణంలో వైభవ్ సూర్యవంశీ లాంటి విధ్వంసకర బ్యాటర్ కూడా జట్టులోకి వస్తే ఇక భారత జట్టును ఆపడం ఎవరితరమూ కాదని మాజీలు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంగ్లాండ్ జట్టును వారి సొంత గడ్డపైనే మట్టికరిపించేందుకు బీసీసీఐ ఈ వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. భారత జట్టు జూలై మాసంలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. జులై 1వ తేదీ నుంచి జులై 11వ తేదీ వరకు ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల భారీ టీ20 సిరీస్ జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్ ద్వారానే వైభవ్ బ్లూ జెర్సీలో మైదానంలోకి అడుగుపెట్టబోతున్నాడనే వార్త అభిమానుల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపుతోంది.

# ఐపీఎల్ 2027లో సన్‌రైజర్స్ ఐదుగురు ఆటగాళ్లు ఔట్!

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఫ్రాంచైజీ యజమాని కావ్య మారన్‌కు క్రికెట్ అన్నా.. తన టీమ్ అన్నా ఎంత ప్రాణమో ఎందరికీ తెలిసిందే. స్టేడియంలో జట్టు కొట్టే ప్రతి ఫోర్, సిక్సర్‌కు కావ్య మారన్ ఎగిరి గంతేయడం.. వికెట్ పడినప్పుడు నిరాశతో ముఖం తిప్పుకోవడం ఫ్యాన్స్‌ను ఎంతో ఆకట్టుకుంటుంది. అయితే ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో సన్‌రైజర్స్ హైదరాబాద్ దారుణంగా ఓడిపోవడంతో కావ్య మారన్ గుండె మరోసారి పగిలింది. స్టేడియంలో కావ్య మారన్ ఏడుపు ముఖం చూసిన నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా ఆమె కోసం చాలా బాధపడుతున్నారు.వేలంలో నీళ్లలా డబ్బులు కుమ్మరించి, ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన జట్టును కావ్య మారన్ తయారు చేసుకున్నారు. కానీ కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లో కోట్లు పెట్టి కొన్న ఆటగాళ్లు చేతులెత్తేయడంతో అభిమానుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అంతటి భారీ మొత్తాన్ని తీసుకుంటూ కూడా అత్యంత ముఖ్యమైన మ్యాచ్‌లో జట్టును నట్టేట ముంచిన కొందరు సీనియర్ల ప్రవర్తనపై ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

ఈ నేపథ్యంలో ఐపీఎల్ 2027 మెగా వేలానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఊహించని మార్పులు జరగడం ఖాయమని, ఐదుగురు స్టార్ ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించడం దాదాపు ఖాయమని తెలుస్తోంది.గత మూడేళ్ల ఐపీఎల్ చరిత్రను పరిశీలిస్తే, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కావ్య మారన్‌కు కేవలం బాధను మాత్రమే మిగిల్చింది. 2024లో లీగ్ దశలో అద్భుతంగా ఆడినప్పటికీ, ఫైనల్‌లో కేకేఆర్ ముందు పేకమేడలా కూలిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2025లో అసలు ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేక పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. 2026 సీజన్‌లో భీకరమైన ఆట తీరు కనబరిచినప్పటికీ.. అత్యంత కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ముందు చేతులెత్తేసింది.అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ వంటి దిగ్గజ ఓపెనర్లు ఉన్నప్పటికీ కీలక మ్యాచ్‌ల్లో వారు ఆడకపోవడంపై అభిమానులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

# అమీనాపురంలో అంధకారమే రాజ్యం..!




**- రాత్రి 9:30 దాటినా వెలగని వీధిలైట్లు**

**- ప్రజల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం..?**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మే 29:**

కేసముద్రం మున్సిపాలిటీలోని అమీనాపురం ఐదవ వార్డులో శుక్రవారం రాత్రి తీవ్ర అంధకారం నెలకొంది. రాత్రి 9:30 గంటలు దాటినా ఇప్పటికీ వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రధాన రహదారులు, కాలనీలు చీకటిలో మునిగిపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారు. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రజలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాములు, విష పురుగులు సంచరించే అవకాశం ఉండటంతో ప్రజలు ఇళ్ల బయటకు రావడానికి కూడా భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది.అమీనాపురం ఐదవ వార్డులో గత కొంతకాలంగా వీధిలైట్ల సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలు మార్లు ఫిర్యాదులు చేసినా సమస్యను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి వెంటనే వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాత్రివేళల్లో చీకటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.

# వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట

**- ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి**



ఏషియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పోటీపడే అంశంలో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నెల జరగనున్న ఆసియా గేమ్స్ ఎంపిక పోటీలలో (సెలక్షన్ ట్రయల్స్) పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు అనుమతి ఇచ్చింది. ఇంతకు ముందు వినేశ్ ఫొగాట్ ఆసియా గేమ్స్ 2026 సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనవచ్చంటూ దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ భారత రెజ్లింగ్ సమాఖ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తన పరిధిని మీరిందని, ఎంపిక ప్రమాణాల ప్రకారం వినేశ్ అనర్హురాలని పేర్కొంది. అయితే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌ను విచారించిన సుప్రీం దిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ స్థానంలో వేరొకరు ఉండి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని, కానీ వినేశ్ ఈ దేశాన్ని గర్వపడేలా చేశారని వెల్లడించింది. ఇప్పటికే ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు హైకోర్టు అనుమతి ఇచ్చిందన్న అత్యున్నత న్యాయస్థానం ఈ దశలో వినేశ్‌ను వెనక్కి వెళ్లమని చెప్పడం సరికాదని వ్యాఖ్యానించింది. ప్రస్తుతానికి ఈ విషయంలో తాము ఏం చేయలేమని ఆమె పోటీల్లో పాల్గొనవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఐతే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌పై వినేశ్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి అంశాలకు పరిష్కారం కోర్టుల్లో కాకుండా వ్యవస్థల్లోనే ఉండాలని అభిప్రాయపడింది. క్రీడాకారులు, అధికారులు, సంస్థల మధ్య సమన్వయం బలంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించింది. "ఇలాంటి విషయాల్లో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి సమయంలో కోర్టులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సమతుల్యత పాటిస్తూ కఠిన నిర్ణయాలు తీసుకోవాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ నరసింహ మాట్లాడుతూ, "హైకోర్టు ఇప్పటికే అనుమతి ఇచ్చిన తర్వాత వినేశ్‌లో ఆశలు, అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆమెను ఇంటికి వెళ్లిపోమని చెప్పడం సరైంది కాదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు డబ్ల్యూఎఫ్ఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఏషియన్ గేమ్స్ అధికారులకు మే 14 నాటికే భారత క్రీడాకారుల పేర్లు పంపాల్సి ఉందని అన్నారు. అయితే ఆ గడువు ఇప్పటికే ముగిసిపోయిందని తెలిపారు. ఇది అంతర్జాతీయ సంస్థ పరిధిలో ఉండే అంశమని, భారత కోర్టుల పరిధిలోకి రాదని వాదించారు.అయితే వినేశ్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇచ్చిన సుప్రీంకోర్టు, ఆమె డోపింగ్ పరీక్షలకు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 2024 డిసెంబరులో వినేశ్ కొంతకాలం విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించిందని ధర్మాసనం గుర్తుచేసింది. అనంతరం 2025 జూలైలో ఆమె తల్లి అయ్యారని, 2026 జనవరి 1 నుంచి తాను తిరిగి అర్హత పొందుతానని డబ్ల్యూఎఫ్ఐకి సమాచారం ఇచ్చిందని తెలిపింది. జనవరిలో నిర్వహించిన డోపింగ్ పరీక్షకు వినేశ్ హాజరు కాలేదని, తాను హరియాణా ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లాల్సి వచ్చిందనే ఆమె వివరణను అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) అంగీకరించలేదని ధర్మాసనం పేర్కొంది.

# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు




అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక

సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది అసలు మరీచిక ఎవరు సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ





విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷-లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.

# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా

తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.








# దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా

టాలీవుడ్ దర్శకుడు సుకుమార్- సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన సంగీతం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను సంగీతంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప-2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర సంగీత దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త సంగీత దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.అంతేకాదు, పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి దేవిశ్రీ పూర్తి స్థాయిలో సంగీతం అందించలేకపోయారని, అందుకే ఆ బాధ్యతలను థమన్‌కు అప్పగించారనే ప్రచారం కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఒకప్పుడు వరుసగా దేవిశ్రీతో పనిచేసిన పలువురు స్టార్ దర్శకులు ఇప్పుడు ఇతర సంగీత దర్శకుల వైపు మొగ్గు చూపుతుండటంతో.. సుకుమార్ కూడా అదే దారిలో వెళ్తారా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉందని సమాచారం. కథ పూర్తిగా సిద్ధం కాకముందే సంగీత దర్శకుడిని ఫైనల్ చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది.

# పెద్దిపై అసత్య ప్రచారం

- ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు




'పెద్ది'పై అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా విషయంలో టీమ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా దీనిపై ఆన్‌లైన్ వేదికగా అసత్య ప్రచారం చేస్తోన్న ఇద్దరి వ్యక్తులను గుర్తించి వారిపై ఫిర్యాదు చేసింది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు 'పెద్ది'పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో నెగెటివిటీ క్రియేట్ చేస్తున్నట్లు టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆధారాలను సేకరించిన చిత్రబృందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే చిత్ర నిర్మాతలు ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్న విషయం తెలిసిందే. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు వెకేషన్ బెంచ్ తాజాగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలు చేపట్టినట్లు అయింది. ఇప్పుడు ఇలా సోషల్ మీడియాలోనూ చిత్రబృందం యాక్టివ్‌గా ఉంటూ నిశితంగా పరిశీలించి నెగెటివిటీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది



# స్టైల్ మార్చిన తమిళనాడు సీఎం..

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన లుక్‌ను మార్చాడు. తన మేనేజర్ జగదీష్ పళనిసామి గృహప్రవేశ వేడుకలో సాంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించి సందడి చేశారు. ఆయన ఎప్పుడూ కనిపించే నల్లటి బ్లేజర్ లుక్‌కు భిన్నంగా ఈ సాంప్రదాయ శైలిలో కనిపించడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. తమిళనాడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి విజయ్ సాధారణంగా నల్లటి బ్లేజర్, తెల్లటి షర్ట్ మరియు నల్లటి ప్యాంటు ధరిస్తూ వస్తున్నారు. అయితే, చెన్నైలో జరిగిన తన మేనేజర్ జగదీష్ కొత్త ఇంటి ప్రారంభోత్సవానికి మాత్రం ఆయన పూర్తి సాంప్రదాయ లుక్‌లో హాజరయ్యారు. విజయ్ ఈ వేడుకకు విచ్చేసిన వీడియోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. ఆయన ఇంట్లోకి అడుగుపెట్టగానే అక్కడున్న వారంతా చప్పట్లతో, కేరింతలతో ఘన స్వాగతం పలికారు. జగదీష్ కుటుంబ సభ్యులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ హగ్ చేసుకున్నారు. ఈ వేడుకకు హాజరయ్యే ముందు విజయ్ సచివాలయంలో కూడా ఇదే సాంప్రదాయ దుస్తులలో కనిపించడం విశేషం. జగదీష్‌తో మంచి అనుబంధం ఉన్న నటుడు కతీర్ కూడా ఈ వీడియోలో కనిపించారు.